

ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 32.0 | కనిష్ఠం : 24.0

వర్షం కోసం అభిషేకం

మరికల్, జూన్ 29 : భారీ వర్షం కురవాలని నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో రైతులు శనివారం కృష్ణా నది జలాలతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో రైతులు వర్షాధారంగా పంటలు సాగు చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు అవుతున్నా సరైన వర్షం కురవక మొలకలు ఎండిపోతున్నాయి. దీంతో మరికల్ భజన మండలి ఆధ్వర్యంలో పట్టణ ప్రజలు, రైతులు కృష్ణానది జలాలతో పూజలు చేశారు. అనంతరం 101 బిందెలలో జలాలను తీసుకొచ్చి భజన సంకీర్తనలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గ్రామ దేవతలు, బొడ్రాయిలు, శివాలయంలో శివుడు, ఆంజనేయస్వామికి అభిషేకం చేశారు. సమృద్ధిగా వర్షం కురిసి, పంటలు పండి దిగుబడి అధికంగా రావాలని కోరుకున్నారు.

దారం తెగిన బతుకులకు.. ఆధారం

- చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీ
- ప్రత్యేక రాష్ట్రంలో ఏర్పడిన మొట్టమొదటి పరిశ్రమ
- 15 మంది సభ్యులతో ప్రారంభమై.. ప్రస్తుతం 637 మందికి పెరుగుదల
- నెల నెలా జీతాలతో పాటు లాభాల్లో వాటా
- ఇప్పటి వరకు రూ.2.95 కోట్ల వ్యాపారం

దారం తెగిన చేనేత కార్మికుల బతుకులకు అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీ ఆధారమైంది. పవర్‌లూమ్‌ల రాకతో ఉపాధి కరువై ఆత్మహత్యలే శరణ్యమనుకున్న కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపింది. రెక్కాడితే గాని డొక్కాడని వారికి మూడు పూటలా అన్నం పెడుతోంది. ఇక్కడ తయారు చేస్తున్న చీరలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి కావడం ద్వారా కార్మికుల ప్రతిభ ఎల్లలు దాటుతోంది. కంపెనీ.. కార్మికులకు నెల నెలా జీతాలు ఇవ్వడంతో ఏటా లాభాల్లో 40 శాతం వాటా చెల్లించి, ఆదర్శంగా నిలుస్తోంది.

- అమరచింత



హ్యాండ్లూమ్ కంపెనీలో ఏర్పాటు చేసిన మగ్గాలు



అమరచింత కంపెనీలో చీర నేస్తున్న దంపతులు

వనపర్తి జిల్లా అమరచింతలో ఏర్పాటు చేసిన అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీ చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తోంది. కొడిగడుతున్న దశలో ఉన్న నేత వృత్తికి జవసత్వాలు అందిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రంలోనే మొట్టమొదటగా 2019లో ప్రస్తుత అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీ సీఈవో మహంకాళి చంద్రశేఖర్ కంపెనీ కోసం నాబార్డ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలోనే మొదటి పైలెట్ ప్రాజెక్టుగా నాబార్డు ఈ కంపెనీకి అనుమతి ఇచ్చి, రెండేళ్లపాటు ట్రైనింగ్, సభ్యత్వ నమోదు చేపట్టారు. 2020 జనవరిలో కేంద్ర ప్రభుత్వానికి ఇక్కడ ప్రొడ్యూసర్ కంపెనీ ఉందని, దీనికి చేయూత కావాలని దరఖాస్తు చేశారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వం 2020 మార్చిలో(ఎంఎస్ఎంఈ) కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ క్షుణ్ణంగా పరిశీలించి హ్యాండ్లూమ్ కంపెనీకి అనుమతులు ఇవ్వడంతో పాటు 90 శాతం నిధులు మంజూరు చేసింది. కేంద్రం మంజూరు చేసిన రూ.కోటీ 80 లక్షలు, 10 శాతం కార్మికుల వాటా రూ.20 లక్షలా 20 వేల రూపాయలు కలిపి రూ.రెండు కోట్లా 20 వేలు అయ్యాయి. వాటితో 10 వేల ఎస్ఎఫ్‌టీ మగ్గాల షెడ్డు, 1,600 ఎస్ఎఫ్‌టీతో గార్మెంట్ యూనిట్, 135 మగ్గాలు, 16 టైలరింగ్ మిషన్లు ఏర్పాటు చేసుకున్నారు. మొదట 15 మంది సభ్యులతో ప్రారంభమైన ఈ అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీలో ప్రస్తుతం 637 మంది చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారు.

కార్మికులే వాటాదారులు

అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీలో పని చేసే కార్మికలను వాటాదారులుగా గుర్తిస్తారు. కంపెనీ ద్వారా వారు నేస్తున్న చీరలకు ప్రతీ నెల డబ్బులు ఇవ్వడంతో పాటు ఏటా మార్చిలో ఏడాదిలో కార్మికులు నేసిన చీరలను వివిధ ప్రాంతాల్లో కంపెనీ విక్రయిస్తుంది. అలా వచ్చిన లాభాల్లో కంపెనీ 60 శాతం తీసుకుని, 40 శాతం కార్మికులకు అందిస్తారు. దీంతో కార్మికుల కష్టానికి ఫలితం అందడంతో పాటు కంపెనీ వాటాదారుగా ఉన్నారు. కంపెనీలో ప్రస్తుతం 133 మగ్గాలు ఉండగా, 93 రన్నింగ్‌లో ఉన్నాయి. ఒక్కో మగ్గంలో ఇద్దరు చొప్పున 180 మంది కార్మికులు రోజూ పని చేస్తున్నారు. కంపెనీలో సభ్యత్వం తీసుకున్న పలువురు కార్మికులు ఇళ్ల వద్ద కూడా మగ్గాల ద్వారా చీరలు నేస్తున్నారు. పనిని బట్టి ప్రతీ నెల ఒక్కో కార్మికుడు రెండు నుంచి మూడు చీరలను తయారు చేస్తారు. ఆ చీరలకు డబ్బులను భార్యాభర్తల అకౌంట్లలో సగం సగం సమానంగా జమ చేస్తారు. కార్మికుడు మద్యానికి, ఇతర దుబారా ఖర్చులు చేయకుండా ఇలా ఇద్దరి అకౌంట్లలో డబ్బులు వేస్తున్నారు.

రూ.2.95 కోట్ల బిజినెస్

కంపెనీలో ప్రస్తుతం 600 మందికిపైగా కార్మికులు పని చేస్తున్నారు. ఈ కంపెనీ ద్వారా నేసిన చీరలను ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా విక్రయిస్తున్నారు. ఇప్పటికే బాంబే, పూణె, బెంగళూరు, హైదరాబాద్ నగరాలతో పాటు పలు రాష్ట్రాలకు వీటిని అమ్ముతున్నారు. ఇప్పటి వరకు వెయ్యి మంది కస్టమర్లు ఈ కంపెనీ ద్వారా చీరలు పొందడం గమనార్హం. వివిధ ప్రాంతాల్లోని పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ ఈ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంటున్నాయి. 2020 మార్చి నుంచి 2021 మార్చి వరకు చీరలు విక్రయించడం ద్వారా రూ.26,250 వచ్చాయి. 2021 మార్చి నుంచి 2022 మార్చి వరకు రూ.65 లక్షలు, 2022 మార్చి నుంచి 2023 మార్చి వరకు రూ.98 లక్షలు, 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు రూ.కోటీ 32 లక్షల ఆదాయం వచ్చింది. 2020 నుంచి ఇప్పటి వరకు రూ.రెండు కోట్లా 95 లక్షలా 20 వేల బిజినెస్ ఈ కంపెనీ ద్వారా జరిగింది. కంపెనీలో పని చేసే కార్మికులు ప్రతీ నెల రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదించడంతో పాటు వారు తయారు చేసిన చీరల కొనుగోళ్లపై ఏటా వచ్చిన లాభాల్లో 40 శాతం వాటా సైతం తీసుకుంటున్నారు. కంపెనీకి వచ్చిన 60 శాతం లాభాల్లో మగ్గాల మెయింటెనెన్స్, సిబ్బంది జీతాలు, ముడి సరుకు తదితర వాటి కోసం ఖర్చు చేస్తున్నారు.

రుణాలు ఇవ్వడానికి ముందుకొస్తున్న బ్యాంకులు

అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీ విజయవంతంగా కొనసాగుతుండటంతో కంపెనీకి రుణాలు ఇవ్వడానికి తెలంగాణ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు, రాష్ట్ర నాబార్డు, డీసీసీబీ బ్యాంకులు సైతం రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నాయి. కరోనా సమయంలో నాబార్డు రూ.ఐదు లక్షల గ్రాండ్ ఇవ్వగా, 2023లో తెలంగాణ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు రూ.75 లక్షలు రుణం ఇచ్చింది. ఆత్మకూరు డీసీసీ బ్యాంకు నలుగురు నేత కార్మికులను జాయింట్ లయబుల్స్ గ్రూప్(జేఎల్‌జీ) విభజించి ఒక్కో గ్రూప్‌కు రూ.రెండు లక్షల రుణాలు అందజేసింది. గ్రూప్ ద్వారా పొందిన రుణాల్లో సైతం సబ్సిడీ వర్తింపజేసేలా కంపెనీ చర్యలు తీసుకుంది. కంపెనీలో సభ్యత్వం పొంది, పని చేస్తున్న కార్మికులకు రూ.10 లక్షల బీమా సౌకర్యం సైతం కల్పించింది.

రాష్ట్ర ఉత్తమ వీవర్స్‌గా అవార్డులు

కంపెనీ నుంచి గత ఏడాది రాష్ట్ర ఉత్తమ వీవర్స్ అవార్డుకు ఇద్దరు కార్మికులు ఎంపికయ్యారు. అమరచింతకు చెందిన పోతు రాధ, మహంకాళి బాలస్వామి అవార్డులు అందుకున్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న కంపెనీలో సభ్యత్వం పొందడానికి అమరచింతతో పాటు గద్వాల, తిప్పడంపల్లి, ఆరాగిద్ద, గట్టు, కొత్తకోట, కోటకొండ, రాజోలి, నాగర్‌దొడ్డి తదితర ప్రాంతాల నుంచి కార్మికులు ముందుకొస్తున్నారు. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న చేనేత వృత్తికి అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీ జీవం పోసిందని చెప్పొచ్చు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో మార్కెట్‌లో పవర్‌లూమ్ పంజా విసురుతున్న తరుణంలో చేనేత హ్యాండ్లూమ్ కళ అంతరించిపోకుండా అమరచింత కంపెనీ దోహదపడుతోంది.

కుటుంబ పోషణకు బాగుంది



మేం భార్యాభర్తలం కంపెనీలో పని చేస్తున్నాం. గతం కన్నా ఇప్పుడు కుటుంబ పోషణ బాగా నడుస్తుంది. ప్రతీ నెల నేరుగా బ్యాంకు ఖాతాలో డబ్బులు వేస్తున్నారు.

- సుజాత, కార్మికురాలు, అమరచింత

నెలకు రూ.30 వేల వరకు సంపాదిస్తున్నా



అమరచింత కంపెనీతో చేతి నిండా పని దొరుకుతోంది. బాగా కష్టపడి పని చేస్తున్నా. నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నా. గతంలో పని లేక ఇబ్బంది పడిన సందర్భాలు ఉన్నాయి.

- సాక బాలరాజు, నేత కార్మికుడు, అమరచింత

అందరి సహకారంతో అభివృద్ధి



ఎన్నో స్వచ్ఛంద సంస్థలు నడిపిన తాను.. పుట్టిన ఊరిలో చేనేత పరిస్థితి దుర్భరంగా మారడం చూసి బాధపడ్డా. అందరి సహకారంతో అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీ తీసుకొచ్చా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, బ్యాంకుల ప్రోత్సాహంతో ముందుకెళ్తున్నాం. ప్రభుత్వాలు మరింత సహకరిస్తే భారతదేశంలోనే ఈ కంపెనీ ఆదర్శంగా ఉంటుంది. చేనేత కళను అందరం కలిసి కాపాడుకోవాలి. చేనేతతో పాటు టైలరింగ్‌నూ కంపెనీ ద్వారా ప్రోత్సహిస్తున్నాం.

- మహంకాళి చంద్రశేఖర్, సీఈవో, అమరచింత చేనేత హ్యాండ్లూమ్ కంపెనీ

అవిశ్వాసం పెట్టండి



మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ కలెక్టర్‌కు వినతి ప్రతం ఇస్తున్న వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

- జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ ఇష్టానుసారంగా తీర్మానాలు చేస్తున్నారు
- భర్తతో అక్రమాలు చేయిస్తున్నారు
- కలెక్టర్‌కు విన్నవించిన వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు
- రసాభాసాగా మారిన మునిసిపల్ సాధారణ సమావేశం
- కార్యాలయం గేటు వద్ద నిరసన

జడ్చర్ల, జూన్ 29: జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ పాలకవర్గం సభ్యులంతా కలెక్టర్ విజయేందిరబోయికి శనివారం వినతి పత్రం అందచేశారు. వైస్ చైర్‌పర్సన్‌తో సహా 25 మంది కౌన్సిలర్‌ల సంతకాలతో కూడిన పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి పాలనా విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. కౌన్సిల్ సమావేశంలో పొందుపరిచే ఎజెండాను కౌన్సిలర్‌లకు తెలియకుండానే ఇష్టానుసారంగా తయారు చేస్తున్నారని తెలిపారు. ఇష్టం వచ్చినవిధంగా తీర్మానాలు తయారు చేసుకుని నచ్చిన వాళ్లకు కాంట్రాక్ట్‌లు ఇస్తున్నారని అన్నారు. కాంట్రాక్టులలో, అసెస్‌మెంట్‌లలో, మ్యుటేషన్‌లలో, ట్రేడ్ లైసెన్స్‌లలో ఎన్నో అక్రమాలను చైర్‌పర్సన్ తన భర్తతో చేయిస్తున్నారని, ఆమె భర్త సైతం ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ, వివక్ష చూపిస్తూ చేస్తున్న పరిపాలనపై విసిగిపోయామని తెలిపారు. చైర్‌పర్సన్‌ను ఆ పదవి నుంచి తొలగించేందుకు అవిశ్వాసం తీర్మానం పెట్టాలని కలెక్టర్ వివరించారు.

మునిసిపల్ సాధారణ సమావేశం రసాభాస

జడ్చర్ల మునిసిపాలిటీ సాధారణ సమావేశం శనివారం రసాభాసగా మారింది. చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు కౌన్సిలర్‌లు ప్రకటించారు. వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లు మునిసిపల్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద బైఠాయించి చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మితో పాటు కమిషనర్ రాజయ్యలపై నిరసన తెలిపారు. సమావేశం ఎజెండా ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్‌లు ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్ గౌడ్‌లు మాట్లాడుతూ పాలకవర్గం సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎజెండా తయారు చేశారని ఆరోపించారు. చైర్‌పర్సన్, కమిషనర్‌లు వినియోగిస్తున్న వాహనాలకు చెరో రూ.నాలుగు లక్షల డీజిల్ బిల్లులు పెట్టుకున్నారని చెప్పారు. ఉన్న బడ్జెట్‌లో రూ.ఎనిమిది లక్షలు డీజిల్ బిల్లులకే చెల్లిస్తే అభివృద్ధి పనులు ఎలా చేపట్టాలని ప్రశ్నించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు బోర్లు వేయించి, మోటర్‌లను రిపేర్ చేసినందుకు రూ.45 లక్షలు వెచ్చించినట్లు ఎజెండాలో పొందుపరిచారని చెప్పారు. బోర్లు ఎక్కడ వేయించారని?, ఎక్కడెక్కడ ఉన్న మోటర్‌లను మరమ్మతులు చేశారని చైర్‌పర్సన్, కమిషనర్‌లు ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వలేదని తెలిపారు. ప్రతీ వార్డుకు కనీసంగా రూ.మూడు లక్షల బడ్జెట్ కేటాయించాలని కౌన్సిలర్‌లమంతా సూచిస్తే.. అందుకు విరుద్ధంగా బడ్జెట్ కేటాయింపులు చేపట్టారని ఆరోపించారు. చైర్‌పర్సన్‌కు బదులుగా ఆమె భర్త పెత్తనం చెలాయిస్తూ అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆరోపించారు. అనంతరం చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలంటూ మహబూబ్‌నగర్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో కౌన్సిలర్‌లు జ్యోతి, బుక్క మహేష్ నవనీత, శ్రావణి, శశికిరణ్, చైతన్య చౌహాన్, కుమ్మరిరాజు, దేవా, రమేశ్, శ్రీశైలమ్మ, ఉమారాణి, లతతో పాటు పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.



మునిసిపల్ కార్యాలయ గేటు వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

ఏరువాక పోయినా.. ఏరు పారలే



నీటి ప్రవాహం లేని తుంగభద్ర నది

- తుంగభద్ర నదికి రాని వరద
- నదిని నమ్ముకొని పంటలు సాగు చేస్తున్న రైతులు
- ఈ సారి వానలు రాకపోవడంతో సాగు ఆలస్యమౌతుందని ఆందోళన

అయిజ, జూన్ 29: ఏరువాక ముగిసినా వర్షాలు కురవడం లేదు. తుంగభద్ర నదికి వరద రాకపోవడంతో అలంపూర్ నియోజకవర్గంలో సాగు ఆలస్యమౌతోంది. తుంగభద్ర నదిని నమ్ముకుని నియోజకవర్గంలోని అయిజ, రాజజోళి, వడ్డేపల్లి మండలాల్లో రైతులు వరి, ఉల్లి, మిరప తదితర పంటలు సాగు చేస్తారు. నదిలోని గోతులలో నీరు తప్ప తప్ప ప్రవాహం లేకపోవడంతో పంటలు వేసేందుకు రైతులు సాహసించడం లేదు. విత్తనాలు, ఎరువులు కొనుక్కొని, వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.



భూంపురంలో ఎండిపోతున్న వేరుశనగ పంట

వర్షాధారంగానే పంటలు

జోగుళాంబ గద్వాల జిల్లాలో వర్షాధార పంటలే అధికంగా సాగుఅవుతాయి. జిల్లా వానాకాలంలో సాధారణ సాగు లక్షా 22 వేల ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 62,300 ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. ఈ యేడు తొలకరి వానలు ముందస్తుగా కురవడంతో ఆనందించిన రైతులు కంది, వేరుశనగ, మొక్కజొన్న, పెసర, ఆముదం, పత్తి పంటలు సాగు చేశారు. ఇప్పటి వరకు 40 శాతం మేర పంటలు వేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వర్షాలు అనుకూలించిన చోట మొలకలు రాగా, అనుకూలించని చోట మొలకెత్త లేదు. రోహిణి కార్తెలో సాగు చేసిన మొక్క జొన్న పంటలు నీళ్ల లేక ఒట్టిపోతున్నాయి. దాంతో రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఆకాశం మేఘావృతం అవుతున్నా.. చినుకు రాలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉత్తనూరులో వాడిపోతున్న కంది చేను

మద్యం మత్తులో స్కూల్ బస్సు నడిపిన డ్రైవర్

- చెట్టుకు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు

వనపర్తి రూరల్, జూన్ 29 : డ్రైవర్ మద్యం మత్తులో స్కూల్ బస్సును నడిపి చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మిగతా వారికి స్వల్ప గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా రాజనగరం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకున్నది. వనపర్తిలోని అనూస్ అకాడమీ హైస్కూల్ యాజమాన్యం ఇతర గ్రామాల నుంచి తీసుకొచ్చిన విద్యార్థులను ప్రతీరోజు మాదిరిగా ఆయా గ్రామాలకు తరలించేందుకు బస్సులను ఏర్పాటు చేసింది. సాయంత్రం పాఠశాల సమయం పూర్తికాగానే రాజనగరం, అచ్యుతాపురం, పెద్దమందడి, జగత్‌పల్లి గ్రామాలకు వెళ్లే విద్యార్థులు పాఠశాల బస్సును ఎక్కారు. అప్పటికే డ్రైవర్ వేణుగోపాల్ రెడ్డి తాగిన మైకంలో ఉండటం పాఠశాల యాజమాన్యం గమనించలేదు. రాజనగరం శివారుకు రాగానే డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఉన్న చింత చెట్టుకు ఢీకొట్టాడు. అప్పటికే బస్సులో దాదాపు 50 మందికిపైగా ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలు కాగా మిగతా విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వనపర్తి మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన నవీన్ శర్మ కూతురు శ్రీవల్లి, కుమారుడు కారుణ్యకు తీవ్ర గాయాలు అయినట్లు స్థానికులు గుర్తించారు. తీవ్ర గాయాలైన విద్యార్థులను జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. మెరుగైన చికిత్స అనంతరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



చింత చెట్టును ఢీకొన్న అనూష అకాడమీ స్కూల్ బస్సు



తీవ్ర గాయాలైన శ్రీవల్లిని ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబీకులు

కూలీలను తీసుకెళ్తున్న వాహనం బోల్తా

- ముగ్గురి పరిస్థితి విషమం, పలువురికి గాయాలు



బోల్తా పడిన బొలెరో వాహనం

నాగర్‌కర్నూల్/కోడేరు/నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని కోడేరు, జనుంపల్లి గ్రామాల మధ్యన గల నల్లగుట్ట సమీపంలో కూలీలను తీసుకెళుతున్న బొలేరో వాహనం శనివారం ఉదయం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండగా, పలువురు గాయపడ్డారు. కూలీలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోడేరు మండల కేంద్రానికి చెందిన బద్దుల రాముడు బొలేరో వాహనం డ్రైవర్ బద్దుల మహేష్ ఉదయం పెద్దకొత్తపల్లి మండలం మహాసముద్రం గ్రామానికి చెందిన 22 మంది కూలీలను ఎక్కించుకున్నాడు. అదే వాహనంలో కోడేరుకు చెందిన 12 మంది కూలీలను కూడా ఎక్కించుకొని మొత్తం 34 మందిని తాడూరు మండలం యాదిరెడ్డిపల్లి గ్రామానికి పత్తి చేనులో పని చేయడానికి బయలుదేరాడు. కోడేరు శివారులోని నల్లగుట్ట దగ్గర జనుంపల్లి నుంచి కోడేరు వైపు ఎదురుగా వస్తున్న ఓ బైక్‌ను కోడేరు నుంచి జనుంపల్లి వెళుతున్న బొలేరో వాహనం తప్పించబోయి బైక్‌కు కొద్దిగా తగిలింది. దీంతో బైక్ కింద పడి బైక్ నడుపుతున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. బొలేరో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుకు తగిలి బోల్తా పడింది. వాహనంలో ప్రయాణిస్తున్న మహాసముద్రం గ్రామానికి చెందిన కూలీ బెల్లె బాలమ్మ కాలు, శీలం చెన్నమ్మ చెయ్యి, కోడేరు గ్రామానికి చెందిన ఆరిగలి చిట్టెమ్మ కాలు విరిగాయి. ఇదే గ్రామానికి చెందిన కృష్ణమ్మకు ఆపరేషన్ చేసిన కుట్ల దగ్గర గాయమైంది. మిగిలిన కూలీలకు స్వల్పగాయాలయ్యాయని ఏఎస్ఐ ఖయ్యూమ్ తెలిపారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నదన్నారు. క్షతగాత్రులను హుటాహుటిన అంబులెన్స్‌లో స్థానికులు కోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఘటనలో గాయపడ్డ 30 మందిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పతికి తరలించారు. వారిలో చిట్టెమ్మ, బాలమ్మల పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. చెన్నమ్మ, సరస్వతి, అలివేల, కృష్ణమ్మలకు స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రిలోనే వైద్యం అందిస్తున్నారు. స్వల్ప గాయాలైన 24 మందికి చికిత్స చేసి, ఇంటికి పంపించారు.





చికిత్స పొందుతున్న బాలమ్మ, చిట్టెమ్మ

బ్రోకర్ల అత్యాశ కూలీలకు ప్రాణ సంకటం

బ్రోకర్ల అత్యాశ మహిళా కూలీల ప్రాణాల మీదకు తెస్తోంది. కోడేరు, జనుంపల్లి గ్రామాల మధ్య పత్తి చేలకు కూలీ నిమిత్తం వెళ్తున్న బొలెరో వాహనం శనివారం బోల్తా పడి 25 మంది గాయాలైన ఘటన అందుకు అద్దం పడుతోంది. వానాకాలం సీజన్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజిపేట, తాడూరు, తెలకపల్లి, నాగర్‌కర్నూల్ మండలాల్లో పత్తి పంటను సాగు చేస్తారు. ఆయా మండలాల్లో ఈ సారి లక్షా 30,998 ఎకరాల్లో పత్తి నాటారు. పత్తిని సాగులో కూలీల అవసరం ఎక్కువగా ఉండటం బ్రోకర్లకు వరంగా మారింది. ఈ క్రమంలో బ్రోకర్లు కొల్లాపూర్ నియోజకవర్గంలోని కోడేరు, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి మండలాల నుంచి తాడూరు, తెలకపల్లి, బిజినేపల్లి, యాదిరెడ్డిపల్లి, తాళ్లపల్లి, పెద్దూరు గ్రామాలకు మహిళా కూలీలను తెస్తున్నారు. రైతుల నుంచి ఒక్కో కూలీకి రూ.400 తీసుకుంటూ.. కూలీలకు మాత్రం రూ.250 నుంచి రూ.300 మాత్రమే చెల్లిస్తున్నారు. వాహనాల చార్జీల పేరిట మరో రూ.1,500 నుంచి రూ.2,500 వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను చేరవేస్తున్నా రవాణా శాఖ అధికారులు నోరు మెదపడం లేదు. బొలెరో వాహనం కేవలం సరుకుల రవాణాకు మాత్రమే వినియోగించాల్సి ఉండగా కూలీలను తరలించడం గమనార్హం. గతేడాది మే 12న తాడూరు మండలం గుంతకోడూరు వద్ద చిన్న ఆటోలో 16 మంది కూలీలను ఎక్కించుకుని తీసుకెళ్తుండగా బోల్తా పడి, ఆరుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.









హైదరాబాద్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్‌కు పలువురు నివాళి అర్పించారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ, గద్వాల మాజీ ఎమ్మెల్యే డీకే.భరతసింహారెడ్డి తదితరులు శ్రీనివాస్ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సేవలను నేతలు గుర్తు చేసుకున్నారు.

గ్రూప్-2 పోస్టులు పెంచాలి

›› పీయూలో విద్యార్థుల ఆందోళన


పాలమూరు యూనివర్సిటీ, జూన్ 29 : గ్రూప్-2 పోస్టులు పెంచాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ ఆవరణలో బీఎస్ఎఫ్ఐ (బహుజన స్టూడెంట్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో పీయూ విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్ మాట్లాడుతూ గ్రూప్-1 పోస్టులతో పాటు, గ్రూప్-2 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. డీఎస్సీలో 30వేల పోస్టులను భర్తీ చేయాలని, గ్రూప్-1 పోస్టుల కోసం ప్రిలిమ్స్‌లో 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కి ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల ఓయూ ఐకాస చైర్మన్ మోతీలాల్ నిరుద్యోగుల పక్షాన ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని, ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దౌర్భాగ్యమన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీయూ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రూప్-2 పోస్టులు పెంచాలని పీయూ లైబ్రరీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు







రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నవీన్ (ఫైల్)

కొల్లాపూర్, జూన్ 29 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి గ్రామానికి చెందిన పెద్దాపురం నవీన్(20) శుక్రవారం వనపర్తిలో ఒక ఫంక్షన్‌కు వెళ్లి రాత్రి ఇంటికి కారులో తిరిగి వస్తూ బంధువులను కల్వకోల్ గ్రామంలో వదిలి పెట్టాడు. అక్కడ్నుంచి దాదాపు 11 గంటల సమయంలో గ్రామానికి వస్తుండగా గ్రామ సమీపంలో కొల్లాపూర్ ప్రధాన రహదారిలో కారు కల్వర్టును ఢీకొట్టింది. దీంతో కారు పొలంలోకి వెళ్లి బోల్తా పడింది. ఆ సమయంలో ఆ చుట్టుపక్కల ఎవరు లేకపోవడంతో నవీన్ కారులోనే మృతి చెందాడు. గ్రామస్థుల సమాచారం మేరకు శనివారం ఉదయం కుటుంబీకులు ఘటనా స్థలానికి వెళ్లారు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

యువతి అదృశ్యం

నవాబ్‌పేట, జూన్ 29 : ఇంటి వద్ద ఉన్న ఓ యువతి కానరాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(21) ఈనెల 23న తల్లిదండ్రులు బంధువు అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. వచ్చి చూసే సరికి ఇంటివద్ద ఉన్న వారి మూడవ కూతురు అదృశ్యమైంది. యువతి కోసం గాలించినా ఆచూకీ తెలియకుండా పోవడంతో తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణభయం ఉందంటూ అర్చకుడి ఫిర్యాదు

›› ముగ్గురిపై కేసు నమోదు

అలంపూర్ చౌరస్తా, జూన్ 29 : తనకు ధన, మాన, ప్రాణభయం ఉందంటూ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరాలయాల ప్రముఖ అర్చకుడు దిండిగల్ ఆనంద్‌శర్మ శనివారం ఉండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ, వనపర్తి జిల్లా అధ్యక్షుడు పీవీ.లక్ష్మీకాంతరావు, పులికల్ రంగనాథస్వామి అర్చకుడు అశోక్‌లు ఈనెల 25న తనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, అనంతరం తనను బెదిరించారని, నాలుగు రోజులుగా తనను గుర్తు తెలియని వ్యక్తులు వెంబడిస్తున్నారని దీనివల్ల తనకు ప్రాణభయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. గత ప్రభుత్వం తనను ధూపదీప నైవేద్య పథకంలో భాగంగా త్రీమెన్, సెలక్షన్ కమిటీ సభ్యుడిగా నియమించిందని అందులో తాను నిర్వహించిన విధుల పట్ల తనపై కక్ష కట్టారని తెలిపారు. ఆనంద్‌శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

మహబూబ్‌నగర్, జూన్ 29 : భూవ్యవహారంలో ఫోర్జరీ సంతకాలు చేసిన ముగ్గురు వ్యక్తులపై వన్‌టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్ సమీపంలో 1.30 గుంటల భూమిని 2013లో జమీర్ అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. ఆ తరువాత ఈ భూమి బైపాస్‌లో పోవడంతో కొనుగోలు చేసిన వ్యక్తికి భూపరిహారం ఇచ్చే సమయంలో మధ్యవర్తిగా ఉన్న రహీం అనే వ్యక్తి భూమి విక్రయించిన అంజయ్యతో కలిసి జమీర్ సంతకాలు ఫోర్జరీ చేసి భూమి కొనుగోలు చేసి తమకు డబ్బులు ఇవ్వలేదని కోర్టును ఆశ్రయించారు. ఈ విషయం తెలుసుకున్న జమీర్ తన సంతకాలను ఫోర్జరీ చేసి కోర్టు ఆశ్రయించారని హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లేగ దూడపై చిరుత దాడి

కొత్తపల్లి, జూన్ 29 : నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం గోకుల్‌నగర్ గ్రామంలోని ఓ వ్యవసాయ పొలంలో ఉన్న లేగదూడపై చిరుత దాడి చేసి చంపేసింది. బాధిత రైతు కావలి కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం పశువులను తన వ్యవసాయ పొలంలో కట్టివేసి ఇంటికి వెళ్లానన్నారు. శనివారం ఉదయం పొలానికి వచ్చి చూసేసరికి లేగదూడ రక్తపు మడుగులో కన్పించింది. వెంటనే చుట్టుపక్కల రైతులతో కలిసి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారి లక్ష్మణ్ ఘటనా స్థలానికి వచ్చి చనిపోయిన లేగదూడను పరిశీలించారు. బాధిత రైతుకు శాఖ తరుపున నష్ట పరిహారం అందిస్తామని అన్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

జడ్చర్ల, జూన్ 29 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య(55) మృతదేహం ఉదండాపూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం లభ్యమైనట్లు ఏఎస్సై నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 24న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన తన తండ్రి మల్లయ్య తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆయన ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఈనెల 26న జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో కుమారుడు కృష్ణయ్య ఫిర్యాదు చేశాడు. అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన మల్లయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తమకు సమాచారమందించారన్నారు. మిస్సింగ్ కేసును ఆత్మహత్య కేసుగా మార్చినట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో కాడెద్దులు మృతి

దామరగిద్ద, జూన్ 29 : విద్యుదాఘాతంతో కాడెద్దులు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మద్దెల్‌బీడ్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు ఎర్ర బస్సప్ప పొలంలో కొత్తగా బోరు వేసుకున్నాడు. తన బోరు కాలిపోవడంతో స్తంభం నుంచి బోరుకు వెళ్లిన వైరు భూమిలో నుంచి వేశారు. శనివారం పొలంలో గుంటుక తోలుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఎద్దులకు వైర్లు తగిలి మృతి చెందాయి. వీటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు బస్సప్ప కోరారు.



అలనాటి కథ

మారిషస్ అనగానే అనేక జ్ఞాపకాలు నన్ను చుట్టుముడతాయి. విశ్వవిఖ్యాతి చెందిన కవి టిఎస్ ఎలియట్‌కు స్వయంగా రాసిన లేఖను బహుమతిగా అందుకోవటం.. ప్రధానులు, రాణులు ఉన్న స్వీట్‌లలో స్టేట్ గెస్ట్‌గా ఉండటం..ఇలా అందమైన గత జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తాయి.

మారిషస్‌లో మరపురాని సంఘటనలు!

తెలుగు లైబ్రరీ శంకుస్థాపన కోసం మారిషస్‌కు వెళ్లిన ఏడాది తర్వాత ఆ దేశ ప్రధాని నన్ను అక్కడ ఉన్న ఒక యూనివర్సిటీలో ప్రసంగించమని ఆహ్వానించారు. ఒక సారి మన దేశం తరపున వెళ్లే.. మరో సారి ఆ దేశం ఆహ్వానంపై అక్కడికి వెళ్లటం మరచిపోలేని అనుభవమనే చెప్పాలి. నా కోసం ఎయిర్‌పోర్టుకు ప్రధాని సర్ శివసాగర్ రాంగులాం సెక్రటరీ విజయ్ ప్రత్యేకంగా వచ్చి.. నన్ను అక్కడ ఉన్న ప్రముఖ హోటల్ లి రిజ్వీకి తీసుకువెళ్లారు. అక్కడ నేను బస చేసిన స్వీట్‌లోనే ప్రధాని ఇందిరాగాంధీ, బ్రిటన్ రాణి ఎలిజిబెత్ ఉన్నారని అక్కడ స్టాఫ్ చెప్పారు. ప్రపంచంలోనే పెద్ద పెద్ద డిగ్నిటరీలు ఉన్న స్వీట్‌ను నాకు కేటాయించటం చాలా ఆశ్చర్యమనిపించింది. ఆ రోజు రాత్రి మారిషస్ గవర్నర్ జనరల్ విలియం భార్య లేడీ విలియం నా రూమ్‌కు వచ్చి నన్ను రాత్రి డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ సమయానికి విలియం నేరుగా హోటల్‌కు వచ్చేశారు. ఆ డిన్నర్ చాలా బాగా సాగింది. ఆ మర్నాడు ఉదయం లేడి విలియం నన్ను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించారు. నేను సున్నితంగా తిరస్కరించాను. మర్నాడు విశ్వవిద్యాలయంలో నా ప్రసంగానికి కూడా మంచి స్పందన లభించింది.



ఈ సందర్భంలో మరో విషయం గురించి చెప్పాలి. మారిషస్‌లో మాల్కం అనే ప్రఖ్యాత రచయిత ఉండేవాడు. అతనిని మారిషస్ ప్రజలు తమ జాతీయ కవిగా భావించేవారు. నేను మారిషస్ వస్తున్నానని తెలిసి ఆయన నా గురించి ఒక వ్యాసం రాశారు. ఎవరి గురించి ఎక్కువగా పొగడని మాల్కం నా గురించి మాట్లాడటం ఒక సంచలనాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో- లేడి విలియం- మార్షల్‌ను కలవాలనుకుంది. నేను కూడా మార్షల్‌కు డిన్నర్ ఇవ్వాలనుకుంటున్నాను కాబట్టి- అందరినీ నా స్వీట్‌కు డిన్నర్‌కు పిలిచాను. ఆ విషయం చెబితే మార్షల్ డిన్నర్‌కు రాడు కాబట్టి- అతనికి లేడి విలియం వస్తున్నట్లు చెప్పలేదు. నేను పిలిచిన సమయానికి మార్షల్ వచ్చారు. మౌనంగా కూర్చున్నాడు. ఆ తర్వాత లేడి విలియంను కూడా వచ్చింది. వారిద్దరికీ పరిచయం చేశారు. లేడి విలియం అనేక విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ మార్షల్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కవులు, కళాకారుల మూడ్స్‌ను ముందుగా గుర్తించటం చాలా కష్టమని మరో సారి నాకు అర్థమయింది.

ఈ పర్యటనలో మరో ఆసక్తికరమైన సంఘటన కూడా జరిగింది. మారిషస్ ప్రధాని కార్యదర్శి విజయ్ నేను ఎక్కడికి వెళ్లినా నాతో పాటే ఉండేవారు. ఒక రోజు హఠాత్తుగా విజయ్‌కు- ఫ్రాన్స్ ప్రధాని మిత్రో మారిషస్‌కు ముందుస్తు సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా వస్తున్నారని.. ఆయనకు వెళ్లి స్వాగతం చెప్పమని ఫోన్ వచ్చింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో విజయ్ నన్ను కూడా ఎయిర్‌పోర్టుకు రమ్మని పిలిచాడు. నేను కూడా అతనితో పాటుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లాను. మిత్రో విమానం ల్యాండ్ అయింది. మిత్రోకు మేము బొకేలు అందించాం. మిత్రోను ప్రసన్నం చేసుకుందుకు విజయ్ రకరకాల విన్యాసాలు చేయటం మొదలుపెట్టాడు. మిత్రో చిన్నప్పుడు రాసిన ఒక కవితను ఇంగ్లీషులో చదివి వినిపించాడు. మిత్రో మొహంలో ఎటువంటి భావాలు కనబడలేదు. "ఇది నా ప్రైవేట్ విజిట్.. ఎటువంటి ప్రొటోకాల్ అవసరం లేదు.. నేను ఒక హోటల్‌లో



ఉంటా" అని విజయ్‌ని కసురుకున్నాడు. ఫ్రాన్స్ ప్రధాని కావాలన్నా.. వద్దన్నా.. ఆయనకు ప్రొటోకాల్ ఇవ్వాల్సిన బాధ్యత మారిషస్ ఉంది. దీంతో విజయ్ - "మీరు ఎక్కడికి వెళ్దాం అక్కడికే వెళ్దాం" అన్నాడు. మేమందరం మిత్రో ముందుగా బుక్ చేసుకున్న ఒక హోటల్‌కు వెళ్లాం. అక్కడ విజయ్‌ను వదిలేసి నేను నా హోటల్‌కు వచ్చేసా! మిత్రో హోటల్‌లో చెకిన్ అయిన తర్వాత 48 గంటల దాకా బయటకే రాలేదట! ఆ తర్వాత బయటకు వచ్చి బీచ్‌లో వ్యాహ్యాళికి వెళ్దామని పిలిచాడట. అక్కడ ఆయన విజయ్‌కు పెట్టిన ఏకైక కండిషన్- "నాకు ఏ ఆహారం పెడతారో.. అదే ఆహారం నా కుక్కకు కూడా పెట్టాలి.. నాకు ఎలాంటి గౌరవం ఇస్తారో.. అలాంటి గౌరవమే నా కుక్కకు ఇవ్వాలి" అని!

ఇలాంటి చిత్రమైన సంఘటనల మధ్య నా మారిషస్ పర్యటన ముగిసింది. నేను భారత్‌కు వచ్చేసే ముందు- ప్రధాని రాంగులాంను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయంలో ఆయన నాకు ఒక అమూల్యమైన బహుమతి ఇచ్చారు. అదే విశ్వవిఖ్యాత కవి టిఎస్ ఎలియట్ స్వయంగా రాసిన ఒక లేఖ! దానిని ఆయన ఒక వేలంపాటలో కొన్నారట. "ఇది మీ దగ్గర ఉంటే బావుంటుంది" అని ఆయన బహూకరించారు. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది. బహుశా ఇప్పుడు ఆ లేఖ విలువ అంతర్జాతీయ మార్కెట్లో కొన్ని కోట్లు ఉంటుందేమో?

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



తెలుగు సినిమాగతిని 'కల్కి' మార్చేసింది..!

తెలుగు సినీ చరిత్రలో వైజయంతి మూవీస్ బ్యానర్‌కు, దాని అధినేత అశ్వనీదత్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఏళ్ల చలన చిత్ర ప్రస్థానం కలిగిన ఈ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కల్కి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రికార్డులు సృష్టిస్తోంది. "ఈ బ్యానర్‌లో నా తొలి సినిమాకు అయిన ఖర్చు 15 లక్షలు. కల్కికి అయిన ఖర్చు సుమారు 700 కోట్లు. 500 రెట్లు ఎక్కువ. నన్ను, నా కుటుంబాన్ని, మా బ్యానర్‌ను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం?" అంటారు అశ్వనీదత్. 'కల్కి' విజయోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో- ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రపంచవ్యాప్తంగా 'కల్కి' సాధించిన విజయం మీకు ఎలా అనిపిస్తోంది?

దీని కోసమే 50 ఏళ్లు వేచి చూశామేమో అనిపిస్తోంది. మూడేళ్ల క్రితం 'కల్కి' షూటింగ్ ప్రారంభించాం. ఏ విషయంలోను ఎప్పుడూ తొందరపడలేదు. రాజీపడలేదు. 'కల్కి-2'కు సంబంధించి కూడా సుమారు నాలుగు వేల అడుగుల ఫిల్మ్ షూట్ చేశాం. మిగిలింది పూర్తి కావాలి. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం.

సినిమా ప్రపంచంలో జయాపజయాలు ఎప్పుడూ ఉంటాయి.. అపజయాలు ఎదురయినప్పుడు సినిమాల నుంచి విరమిద్దామని ఎప్పుడూ అనుకోలేదా?

ఒక్కసారి కూడా అనుకోలేదు. నాకు 22 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు సినిమా తీస్తానని గ్రేట్ ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లా. అప్పుడు ఆయన- "నువ్వు చదువుకున్నావు. వ్యాపారం చేసుకోవచ్చు కదా! ఇక్కడ ఎప్పుడు ఏమవుతుందో తెలియదు.. నేనే ప్రస్తుతం కొన్ని రోజులు ఖాళీగా ఉంటున్నాను" అన్నారు. కానీ నేను సినిమా తీస్తానని పట్టుపట్టాను. సినిమా తీశాను. ఆ రోజు నుంచి జయాపజయాలు ఎన్నో చూశా. 'శక్తి' లాంటి ఘోర పరాజయాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయాల్లో కూడా 'ఇదొక పీడకల. వెళ్లిపోతుంది' అనుకొనేవాణ్ణి.

మీకు ఇంత ఆత్మనిబ్బరం ఎక్కడి నుంచి వచ్చింది?

మా అమ్మ దగ్గర నుంచి వచ్చింది. నేను సినిమా రంగంలోకి వెళ్లటం మా నాన్నకు ఇష్టం లేదు. నేను అమ్మ దగ్గరకు వెళ్లి చెప్పాను చాలా గొడవ చేశాను ఆ సమయంలో నాకు మా అమ్మ పూర్తిగా మద్దతు ఇచ్చింది. వెన్నంటి నిలిచింది. నాన్నతో పోరాడింది. పట్టుదలగా నన్ను మద్రాసుకు పంపించింది. నా సక్సెస్‌ను తను కళ్లారా చూసింది. అందుకే మా అమ్మకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

ఇంత పెద్ద బడ్జెట్‌తో 'కల్కి' ఎలా తీయగలిగారు?

'కల్కి'లాంటి సినిమాను తీయగలగటం కారణం- మా అమ్మాయిలు- స్వప్న, ప్రియాంక. వాళ్లిద్దరు అమెరికాలో చదువుకొని వచ్చారు. ఆ సమయంలో వాళ్లతో ఏదైనా ఒక పరిశ్రమ పెట్టించాలనుకున్నా. కానీ వాళ్లు సినిమా రంగంలోకి రావాలనుకున్నారు. స్వప్న ముందు చిన్న వీడియో చిత్రాలు తీసేది. ప్రియాంక వచ్చిన తర్వాత- ఇద్దరూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. ఆ సమయంలో వాళ్లకు కొన్ని ఫెయిల్యూర్స్ వచ్చాయి. వాళ్లు వాటిని తట్టుకొని నిలబడగలిగారు. ఆ తర్వాత మానసికంగా, శారీరకంగా చాలా కష్టపడి 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా తీశారు. అదొక టర్నింగ్ పాయింట్.

'ఎవడే సుబ్రమణ్యం' - ఒక భిన్నమైన సినిమా. దాని కథ చెప్పినప్పుడు మీరేమన్నారు?

నాకు వాళ్ల మీద నమ్మకం ఉండేది. కానీ అదొక భిన్నమైన సినిమా. ఆ కథ చెప్పినప్పుడు- "కథ డిఫరెంట్‌గా ఉంది. బావుంది.. తీయండి.. అనుభవం వస్తుంది కదా..." అన్నాను. కానీ ఆ సినిమా తీస్తే రిస్క్ ఉంటుందనే విషయం నాకు తెలుసు. వాళ్లకు అనుభవం వస్తే చాలనుకున్నాను. కానీ ఆ సినిమా చాలా పెద్ద సక్సెస్ అయింది. ఆ తర్వాత వాళ్లు చాలా నేర్చుకున్నారు. ఆ సినిమా తర్వాత 'మహానటి' తీశారు. ఆ సమయంలో నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటే సావిత్రి గారు నాకు బాగా తెలుసు. అలాంటి గొప్ప నటి మీద చిత్రం తీయటం అంత సులభం కాదు. 'నేను ఇలాంటి స్టోరీ చేయలేకపోయాను. పిల్లలు చేస్తున్నారు' అనుకొనేవాణ్ణి.. బడ్జెట్ ఎక్కువయింది. పట్టించుకోవద్దని వాళ్లకు ధైర్యం చెప్పా. ఆ సినిమా కాపీ చూసిన తర్వాత మతి పోయింది. అంత గొప్పగా ఉందా సినిమా! ఆ తర్వాత 'జాతి రత్నాలు' పెద్ద హిట్. ఇలా వాళ్లకు సక్సెస్ అనేది ఒక్క రోజులో రాలేదు. ఒకో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఇప్పుడు శిఖరాన నిలబడ్డారు.

> **ప్రథమ కోపం**
>
> నేను బయట ఎక్కువగా ఎమోషన్స్ ప్రదర్శించను. అందరూ నా వాళ్లే కదా! బాధపడే అవకాశం ఉంటుంది. అయితే నాకు ప్రథమ కోపం ఎక్కువ. స్వప్నకు కూడా నా పోలికే ఎక్కువ వచ్చింది. తనకి కూడా నాలాగే షార్ట్ టెంపర్. కానీ వెంటనే సర్దుకుంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. స్వప్న, ప్రియాంక- ఇద్దరూ ఒకే మాట మీద ఉంటారు. వారి అభిప్రాయాలు వేరుగా ఉండచ్చు. ఆలోచనా విధానం మాత్రం ఒకటే!

మీ సమయానికి, ఇప్పటికీ సినిమా నిర్మాణంలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

మా రోజుల్లో హీరో ఇమేజ్ ఆధారంగా కథలను రూపొందించుకొనేవాళ్లం. హీరోలకు చెబితే వెంటనే ఒప్పుకొనేవారు. ప్రస్తుతం ఉన్నన్ని డిస్కషన్స్ ఉండేవి కావు. ప్రస్తుతం సినిమా నిర్మాణ ప్రక్రియ చాలా స్లో అయింది. అన్నీ జాగ్రత్తగా చూసుకొన్న తర్వాత మొదలుపెడుతున్నారు. అవుట్‌పుట్ కూడా అంత గొప్పగానూ వస్తోంది.

మీరు అనేక మంది హీరోలతో సినిమాలు తీసారు కదా.. వారిలో ఉన్న గొప్ప గుణాలేమిటి?

నా సినీ జీవితంలో బెస్ట్ టైమ్ చిరంజీవిగారి ఎంట్రీ తర్వాతే వచ్చిందని చెప్పాలి. 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'తో ఆయనతో ప్రారంభమయిన ప్రస్థానం మరో మూడు సినిమాల వరకూ సాగింది. ఎక్కడా చిన్న పొరపొచ్చాలు కూడా రాలేదు. మహానుభావుడని చెప్పాలి. ఆ తర్వాత నాగార్జునగారితో ఐదు సినిమాలు చేశాను. చాలా మంచి మనిషి. ఇక కృష్ణగారి గురించి చెప్పక్కర లేదు. గొప్ప వ్యక్తి. 'అగ్నిపర్వతం' సినిమా తీస్తున్నప్పుడు ఆయన అనేక సూచనలు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభాస్‌తో చేశా! తనకు కథ చెప్పినప్పుడు - "ఇది నా కోసం రాసిన కథ. నేను చేసి తీరతాను" అని మూడేళ్లు అన్నీ పక్కన పెట్టి సినిమాలో నటించాడు. విపరీతమైన సహకారం అందించాడు. మూడేళ్ల పాటు అతనికి ఈ సినిమా తప్ప వేరే ఆలోచనే లేదు. నేను చేసిన హీరోలందరూ నిర్మాత చల్లగా ఉండాలను కొనేవారే! మంచి సహకారం అందించిన వారే!

మీరు అనేక మంది దర్శకులతో పనిచేశారు. ఏ దర్శకుడితో నాగిని పోలుస్తారు?

నాగిపై ఏ దర్శకుడి ప్రభావం ఉన్నట్లు కానీ, పోల్చగలిగినట్లు కానీ నాకు అనిపించలేదు. తను ఏది అనుకున్నాడో అదే తీశాడు. ఎక్కడా ఎక్కువా లేదు, తక్కువా లేదు. ఒక సీను చూసి- 'దీన్ని ఇంకా బాగా తీయవచ్చు' అని నాకు ఎక్కడా అనిపించలేదు. గ్రాఫిక్స్ విషయంలో తను పడిన శ్రమ అసామాన్యం. తనకు ఇసుమంత గర్వం కూడా లేదు. 'మహానటి' సినిమాలో తన విశ్వరూపం చూపించాడు. అప్పుడు 'భగవంతుడు నాకు అలాంటి అల్లుణ్ణి ఇచ్చాడు చాలు...ఎంత కాలమైనా సినిమాలు తీస్తూనే ఉంటా' అనుకున్నా. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు సినిమాను వేరే స్థాయికి తీసుకువెళ్లాడు.


• సీవీఎల్ఎన్ ప్రసాద్



సమయం గడిచిపోయింది..

నా ఉద్దేశంలో తెలుగు సినిమా గతిని 'కల్కి' మార్చేసింది. మన దేశంలో వచ్చిన గ్రేటెస్ట్ ఫిల్మ్‌లో ఇది కూడా ఒకటి. ఇలాంటి సినిమా తీస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. గత మూడేళ్లు ఆడుతూ పాడుతూనే సెట్స్‌కు వెళ్లేవాడిని. 'వాళ్లు ఒక మహాయజ్ఞం చేస్తున్నారు. దానికి సమిధలు సమకూర్చటమే నేను చేయాల్సింది' అనుకున్నా! ఆ యజ్ఞ ఫలితం చూస్తుంటే విపరీతమైన ఆనందం కలుగుతోంది. పిల్లలను చూస్తుంటే- సినిమా తీసే విధానం నాకు కూడా తెలియదేమోననిపిస్తోంది. అమితాబ్, దీపిక, కమల్‌హాసన్, ప్రభాస్.. ఇలా దేశంలోనే అతి పెద్ద స్టార్స్ అందరినీ తీసుకువచ్చి సినిమా తీయటం అంత సులభం కాదు.

ఎన్టీఆర్ పెట్టిన పేరు!



సినిమా తీయటానికి వెళ్లినప్పుడు- ఎన్టీఆర్- "బ్యానర్‌కు ఏం పేరు పెట్టావు?" అని అడిగారు. "మీరు ఏ పేరు చెబితే ఆ పేరు పెడతా.." అన్నా. ఆయన అక్కడ ఉన్న కృష్ణుడి పటం వైపు చూశారు. "కృష్ణుడు మనకు అచ్చొచ్చిన దైవం కదా... 'వైజయంతి మూవీస్' అని పెట్టు.." అని ఒక కాగితంపై రాసి ఇచ్చారు. అలా ఆ మహానుభావుడితో పేరు పెట్టించుకొనే అదృష్టం దక్కింది.

ఎలా గుర్తుండాలంటే...



తెలుగు సమాజాన్ని, ప్రజలను అర్థం చేసుకొని... వాళ్ల అభిరుచులను గమనిస్తూ.. వాళ్ల అంచనాలకు మించిన గొప్ప సినిమాలు తీసే నిర్మాతగా నన్ను చరిత్ర గుర్తుపెట్టు కోవాలనుకుంటున్నా!

కల్కి- పార్ట్ 2



'కల్కి'ని మొదట రెండు భాగాలుగా తీద్దామని అనుకోలేదు. షూటింగ్ కొంత అయిన తర్వాత అనుకున్నారు. "కమల్‌హాసన్ క్యారెక్టర్ రెండో పార్ట్‌లోనే ఎలివేట్ అవుతుంది. దాని మీద ఎక్కువ వర్క్ చేద్దామనుకుంటున్నా" అని నాగీ చెప్పాడు. 'కల్కి' మొదటి పార్ట్ సూపర్ హిట్ అయింది. రెండోది కూడా మొదటి పార్ట్ కన్నా ఎక్కువ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అమితాబ్, ప్రభాస్, కమల్ ముగ్గురు కలిసే సీన్స్ చాలా గొప్పగా ఉంటాయనిపిస్తుంది.

ఈ ముంబై భామ టీవీ నటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత వెండితెరకొచ్చింది. పేరు నుస్రత్ భరూచా. 'రామ్‌సేతు', 'ఛత్రపతి' లాంటి హిందీ చిత్రాలతో పాపులరైన నుస్రుత్ భరూచా గురించి కొన్ని విశేషాలు...

అందుకే... కెరీర్‌లో నిలబడాలనుకున్నా..!

నుస్రత్ భరూచాకు ఇన్‌స్టాలో ఏడు మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. తన ఇంట్లో ఫొటోలు, పెంపుడు జంతువులు, తినే ఆహారం, యాత్రా విశేషాలు, సినిమా కబుర్లు చెబుతుంటుంది. ఫొటోషూట్స్ అప్‌లోడ్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగా మరీ అంత పెద్ద హిట్లు లేకపోయినా.. ఆమెకు ఇన్‌స్టాలో మంచి ఫ్యాన్‌బేస్ ఉంది.

ఇంట్లో తెలీకుండా..

తన్వీర్, తస్నీమ్ దంపతులకు పుట్టిన గారాల పట్టి నుస్రత్. ముంబైలోనే పుట్టి పెరిగింది. అక్కడే విద్యాభ్యాసం. డిగ్రీ వరకు చదివింది. ఆ మధ్యలోనే సినిమా పిచ్చి పట్టుకుంది. సినిమాల్లోకి వెళ్తానంటే.. కుదరదన్నారు ఇంట్లో. దీంతో చేసేదేమీ లేక కొన్నాళ్లు ఊరుకుంది. ఆ తర్వాత ఇంటి దగ్గరనుంచి ఏదో కోర్సు చదవాలని వెళ్లి.. ఆడిషన్స్‌కు అటెండ్ అయ్యేది. అలా 'కిట్టీ పార్టీ' సీరియల్‌లో ఎంపికయింది. ఇంట్లో వాళ్లకు తెలీకుండా షూటింగ్‌లో పాల్గొంది. చివరికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. ఇదో కెరీర్ అని ఒప్పించింది. 2016లో 'జై సంతోషిమా' అనే చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైంది.

అంత సులువుగా సక్సెస్ కాలేదు..

నుస్రత్ అందం, అభినయం ఉన్నా ప్రతిభ మాత్రం తప్పదని గ్రహించింది. సీరియల్స్‌లో నటించిన అనుభవంతో సినిమాల్లో నటించింది. ఒక్క సినిమా కూడా వర్కవుట్ కాలేదు. హీరో శివాజీ సరసన 'తాజ్ మహల్(2010)'లో నటించింది. ఓ తమిళ చిత్రంలో నటించింది. అయినా ఆమెకు అపజయాలే పలకరించాయి. 'ఎల్.ఎస్.డీ' చిత్రంతో నోటెడ్ అయ్యింది. అలాంటి సమయంలో 2011లో 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో ఆమెకు సక్సెస్ దక్కింది. 'ఆకాష్‌వాణి', 'ప్యార్ కా పంచనామా 2', 'డ్రీమ్ గాళ్', 'రామసేతు'.. లాంటి బాలీవుడ్ చిత్రాల్లోని ఆమె నటనకు చక్కటి గుర్తింపు వచ్చింది. గతేడాది 'ఛత్రపతి' హిందీ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ జోడీగా నటించింది. వాస్తవానికి ఇది ప్రభాస్ 'ఛత్రపతి'కి రీమేక్. ఈ సినిమాతో ఆమెకు క్రేజ్ వరించింది.



> **నేను నటించిన సినిమాను పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు.. బాగా గుర్తుంది! నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకో వాలనుకున్నా**

మ్యూజిక్ వీడియోలతోనూ పాపులర్..

'చలాంగ్' చిత్రంలో రాజ్‌కుమార్. ఆర్ తో కలసి నటించింది. ఇందులో 'కేర్ కి సర్దా..' అనే ఓ పాట యూట్యూబ్‌లో రిలీజ్ అయినప్పుడు.. ముప్పయి కోట్లకు పైగా వీక్షించారు. యోయో హనీసింగ్‌తో చేసిన 'సయాన్ జీ...' పాటను యాభై కోట్లకు పైగా వీక్షించారు. దీంతో నస్రుత్‌కు యూత్‌లో మంచి ఆదరణ దక్కింది. 'అజీబ్ దాస్తా', 'తు జూతీ మే మక్కర్' లతో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఆమె ఫేమ్ అయ్యింది. 'ఒకప్పుడు ఆడిషన్‌కు వెళితే.. సరిపోవు ఈ పాత్రకు అనేవాళ్లు. అవేమీ పట్టించుకోలేదు. సినిమాల్లో నటించటం మొదలెట్టాక.. ఓ చిత్రం పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవటమే కాదు కెరీర్‌లో నిలబడాలి అనుకున్నా' అంటుంది నుస్రత్. రెండేళ్ల క్రితం వెర్టిగో సమస్యతో బాధపడింది. డ్యాన్స్ వేసేప్పుడు కిందపడి మోకాలి, వెన్ను సమస్య వచ్చింది. మానసికంగా బలాన్ని పుంజుకుంది. మళ్లీ మామూలు స్థితికి రావటానికి ఏడాది సమయం పట్టింది. ఆ సమయంలో జీవితం అంటే ఏంటో అర్థమైంది అంటుంది నస్రత్ భరూచా.

పాదాల పగుళ్లు పోవాలంటే...

ఈ వానా కాలంలో కొందరికి, పాదాలు, మడమలు పగిలి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఎక్కువగా పగిలితే ఆ పగుళ్ల నుండి రక్త స్రావం అయే అవకాశం కూడా ఉంటుంది. వర్షరుతువులో పాదాలు కొంచెం ఎక్కువ సేపు నీటిలో నానినా పగుళ్లబాధ తీవ్రం అవుతుంది.ఈ పగుళ్ల నివారణకు ఇంట్లోనే పాటించగల చిట్కాలను తెలుసుకుందాం,



బేకింగ్‌సోడాతో: ఒక బకెట్ లేదా టబ్‌లో గోరువెచ్చని నీరు తీసుకుని, అందులో మూడు స్పూన్ల బేకింగ్ సోడాకలిపి, ఆ నీటిలో పదిహేను నిమిషాల పాటు పాదాలను ఉంచి, తరువాత పొడి బట్టతో పాదాలను తుడిచి ప్యుమిస్ స్టోన్‌తో మృతచర్మ కణాలు తొలగిపోయేలా రుద్ది... తరువాత కొబ్బరినూనెలో అలోవెరా జెల్ కలిపి రాయాలి.

బియ్యపుపిండితో: చర్మం మీది మృతకణాలు తొలగించడంలో బియ్యపుపిండి అద్భుతంగా పని చేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ తేనెలో మూడు టేబుల్‌స్పూన్ల బియ్యపు పిండిని కలిపి, దానికి నాలుగు చుక్కల వెనిగర్ ను చేర్చి, ఆ మిశ్రమంతో పాదాలను పది నిమిషాల పాటు సున్నితంగా మర్దన చేయాలి. దీనివల్ల మృతకణాలు తొలగిపోవడంతో పాటు, తేనె వల్ల చర్మం తేమగా మారుతుంది.

నిమ్మరసంతో: ఐదు స్పూన్ల సముద్రపు ఉప్పుకు ఒక స్పూను కొబ్బరినూనె ఒక చెంచా నిమ్మరసం కలిపిపాదాలకు రాసి, పదిహేను నిమిషాలు ఉంచి చల్లని నీటితో కడిగేయాలి.

యాపిల్ సిడర్ వెనిగర్‌తో: ఒక చెంచా తేనె, ఒక చెంచా బియ్యపు పిండికి, ఒక చెంచా యాపిల్ సిడర్ వెనిగర్ చేర్చి ఈ మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి తరువాత గోరువెచ్చని నీటిలో కడిగేయాలి.

నువ్వుల నూనెతో: నువ్వుల నూనె, కొంత గ్లిజరిన్.. రెండు చెంచాల కాఫీ పొడిని చేర్చి, ఆ మిశ్రమంతో కూడా పాదాలకు మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఓట్‌మీల్‌తో: ఓట్‌మీల్, ఆలివ్ నూనె తేనె బియ్యపుపిండి కలిపిన మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

వెంగమాంబ సన్నిధిలో జడ్చర్ల ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు తదితరులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 29 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలంలోని నర్రవాడలో వెలిసిన శ్రీవెంగమాంబ పేరంటాలమ్మను శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే అమ్మవారిని దర్శించుకొంటానని మొక్కుకొన్నానని, ఆ మొక్కు తీర్చుకునేందుకు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. ఉలవారిపాళెం వెంగమాంబ సేవాసమితికి నిత్యాన్నదానం కోసం రూ.లక్ష విరాళం అందజేసినట్లు చెప్పారు. అనంతరం ఆయన్ను టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆయన సోదరుడు దుశ్యంత్‌రెడ్డి, తదితర నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాదాల రామచంద్ర, మాజీ సర్పంచ్ మల్లంపాటి గురవయ్య నాయుడు, నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, మాదాల తిమ్మయ్య, చినతిమ్మయ్య, దుశ్యంత్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, వంశీరెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూన్ 29 : జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టి, చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. జూన్ 15 నుంచి 29 వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టి తీసుకుంటున్న చర్యలను వివరించారు. తహసీల్దార్లతో ధరణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రతీ రోజు మానిటర్ చేస్తున్నట్లు తెలిపారు. కాన్ఫరెన్స్ అనంతరం ఆమె తహసీల్దార్లు, ఆర్‌డీవోతో మండలాల వారీగా ధరణి దరఖాస్తుల పెండింగ్‌పై మాడ్యుల్ ప్రకారం సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 4,194 దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. డేటా కరెక్షన్ సంబంధించి క్షేత్ర పరిశీలన, రికార్డు పరిశీలన చేసి త్వరగా పరిష్కారం చేయాలని సూచించారు. ఇదేవిధంగా జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలల కోసం స్థలం గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, ఆర్‌డీవో నవీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూన్ 29 : అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శనివారం వెబెక్స్ ద్వారా ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీవోలు, ఇంజనీరింగ్ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన పనులను మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలం వారీగా నిర్దేశించిన సమయంలోగా మిగిలిన పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. పనుల నాణ్యత పరిశీలించి సంతృప్తికరంగా ఉంటేనే ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఎంబీ రికార్డు చేసి తదనుగుణంగా చెల్లింపులు చేయాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ అర్బన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు మునిసిపల్ కమిషనర్, పంచాయతీ రాజ్ ఈఈ సమన్వయం చేసుకొని పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జడ్చర్ల అదనపు కోర్టు న్యాయాధికారి ముద్దాసిర్

జడ్చర్ల, జూన్ 29 : రైతులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని జడ్చర్ల అదనపు కోర్టు న్యాయాధికారి ముద్దాసిర్ అన్నారు. జడ్చర్ల మండలం ఆల్వాన్‌పల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దంటూ సూచించారు. రైతులు రక, రకాలుగా మోసాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, సంబంధిత అధికారికి సమస్యపై ఫిర్యాదు చేసి, న్యాయం పొందాలని సూచించారు. జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జంగయ్య మాట్లాడుతూ తాము పండించిన పంట ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, న్యాయవాదులు మాలిక్ షాకీర్, రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, సాహితిరెడ్డి, రాములు, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, విశ్వేశ్వర్, అశోక్, కోర్టు సిబ్బంది దేవా, లింగం పాల్గొన్నారు.

పీయూలో పుస్తకావిష్కరణ

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 29 : పాలమూరు యూనివర్సిటీలోని అర్థశాస్త్ర విభాగం సీనియర్ అధ్యాపకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.వి. రాఘవేందర్ రాసిన బ్రేన్ డ్రేన్ మిగ్రేషన్ ఎకానమి అనే పుస్తకాన్ని పీయూ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, యూజీ డైరెక్టర్ అంకం భాస్కర్, పీయూ అధికారులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, ఎస్. అర్జున్ కుమార్, రవికుమార్, కరుణాకర్ రెడ్డి, జిమ్మికాటన్ పాల్గొన్నారు.

డీఎస్‌కు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

మహబూబ్‌నగర్, జూన్ 29 : మాజీ పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నాయకులు అన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన డీఎస్ హయాంలో రెండుసార్లు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సీజే బెనహర్, రాములుయాదవ్, బాబుమియా, సుభాష్‌ఖత్రి పాల్గొన్నారు.

సాయిచంద్‌కు ఘన నివాళి

జడ్చర్ల, జూన్ 29 : రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేద సాయిచంద్‌కు జడ్చర్ల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయిచంద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య బీఆర్ఎస్ నాయకులు ఇంతియాజ్‌ఖాన్, విజయ్‌కుమార్, రమేశ్ తదితరులున్నారు.

పోలీసు అధికారులకు సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగ ర్, జూన్ 29 : సుదీర్ఘకాలం ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ చేసిన సీనియర్ అధికారులు లేని లోటు ఎవరూ పూడ్చలేనిదని, అయితే ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదని జిల్లా ఎస్పీ జానకి ధరావత్ అన్నారు. పోలీస్‌శాఖలో జూన్ మాసంతో ఉద్యోగ చేసిన ఏఎస్సై శ్రీనివాసులు, , ఏఆర్ ఎస్సైలు అబ్దుల్ నయీమ్, సయ్యద్ యూసఫ్, అబ్దుల్ జమీర్‌లను శనివారం ఎస్పీ తన కార్యలయంలో తస్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ ఏఆర్ శ్రీనివాసులు, ఏఓ రుక్మిణిబాయి పోలీసుసంఘం అధ్యక్షులు వెంకటయ్య పాల్గొన్నారు.

'ఇండియన్ ఒలింపియాడ్'లో రిషి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 29 : జిల్లా కేంద్రంలోని రాజేంద్ర నగర్‌లో గల రిషి పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన జి.భవిత మూడవ ర్యాంక్, టి. ఆకాంక్ష ఐదో ర్యాంక్, జి.దివ్యకు 10వ ర్యాంక్, వీరితో పాటు పలువురు విద్యా ర్థులు మంచి ర్యాంకులు సాధించారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ చంద్రకళావెంకట్, పూజితమోహన్ రెడ్డి, శిరీష ప్రవీణ్, సుశాంత్‌కృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్

- పలు సమస్యలు లేవనెత్తిన సభ్యులు
- కుక్కల నుంచి రక్షణ కల్పించాలని మొర
- రూ.33.27 కోట్ల ఎఫ్‌డీఆర్..రూ.37.7కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులకు ఆమోదం
- అభివృద్ధికి అందరూ సహకరించాలి : పుర చైర్మన్ ఆనంద్

మహబూబ్‌నగర్, జూన్ 29 : వరుస ఎన్నికల కోడ్‌లతో చాలా రోజుల తరువాత నిర్వహించిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. సభ్యులు తమ వార్డులోని సమస్యలతో పాటు పట్టణంలోని ప్రధాన సమస్యలపై సభలో లేవనెత్తారు. తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్య సమస్యలతో పాటు కుక్కల బెడదపై సభ్యులు సభలో ప్రస్తావించారు. శనివారం మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ అధ్యక్షతన మునిసిపల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంఐఎం కౌన్సిలర్ సాజిద్ మాట్లాడుతూ గడియారం చౌరస్తా నుంచి అశోక్ టాకీస్ చౌరస్తా వరకు రహదారి పూర్తిగా పాడైందని, ఈ రోడ్డుపై నుంచి అధికారులు వెళతారుకానీ రోడ్డును బాగు చేయించరని విచారం వ్యక్తం చేశారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో రూ.5కే ప్రజలకు భోజనం అందిస్తున్నారని, మునిసిపాలిటీ నుంచి వారికి చెల్లించే పేమెంట్ ఎక్కువగా ఉంటున్నందున దీనిపై చర్చించి వారి కాంట్రాక్ట్‌పై పునరాలోచించాలని కోరారు. సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ పట్టణంలోని మార్కెట్‌లలో మాంసం విక్రయాలకు ఇదివరకు మునిసిపల్ స్లాటర్‌హౌస్ నుంచి జీవాలకు ముద్రలు వేసేవాళ్లని, ఇప్పుడు అది లేకపోవడంతో ఎలాంటి గొర్రెలు, మేకలు కోస్తున్నారోనని ప్రజల్లో ఆందోళన ఉందని, మళ్లీ స్టాంపింగ్ విధానం అమలు చేయాలని కోరారు.

అదేవిధంగా 2015 నుంచి ఒకే వ్యక్తికి మునిసిపాలిటీలో ఆరు ట్రాక్టర్‌లు కాంట్రాక్ట్ ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ విభాగం కాకుండా శానిటేషన్ విభాగం టెండర్లు నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. సభ్యులు కట్టా రవికిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఏనుగొండలో ఆరుగురు వ్యక్తులు 4.20 ఎకరాల్లో వెంచర్ చేసేందుకు ఎల్‌పీ నెంబర్ ద్వారా అనుమతులు పొందారని చెబుతూ, ఆ భూమికి ఆనుకుని ఉన్న మరో సర్వేనెంబర్ 25లో 60 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి వెంచర్ చేస్తున్నా రన్నారని తెలిపారు. మండల సర్వేయర్ అది ప్రభుత్వ భూమి అని రిపోర్ట్‌కూడా ఇచ్చారని, దానిపై చర్యలు తీసుకోవా లన్నారు. వార్డు కౌన్సిలర్ మోయిన్‌అలీ మాట్లాడుతూ స్ట్రీట్‌లైట్ల సమస్య చాలా ఉందని, కాంట్రాక్టర్ స్పందించ డం లేదని, ఆ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని కోరారు. కౌన్సిలర్ గోవింద్ మాట్లా డుతూ నాలుగేళ్లుగా అప్పటి పాలకులు తన వార్డులో కమ్యూనిటీ భవనం కోసం ఎన్నిసార్లు అడిగినా లాభం లేకపోయిందని, కొత్త చైర్మన్ ఆనంద్‌గౌడ్ చొరవతో కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేశారని, త్వరగా పనులు చేయించాలని కోరారు. కౌన్సిలర్ అనంతరెడ్డి మాట్లాడుతూ తన వార్డులో మూడ్రోజుల కోసారి నీళ్లు వస్తున్నాయని, బోర్లుకూడా లేవని చెప్పగా చైర్మన్ స్పందిస్తూ మూడు కొత్తబోర్లు వేశామన్నారు. నాకు సమాచారం ఇవ్వకుండానే బోర్లు వేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించగా, ఇకపై కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాలని అధికారులకు చైర్మన్ సూచించారు. అనంతరెడ్డి మాట్లాడుతున్న సమ యంలో ఎంఐఎం కౌన్సిలర్లుసాజిద్, రాశెద్‌ఖాన్‌లతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్ అడ్డుతగలగా కట్టా రవికిషన్‌రెడ్డి జోక్యం చేసుకుని సభ్యుడు చైర్మన్‌ను అడిగితే మీరెందుకు బాధపడుతున్నారని అనడంతో ఎంఐఎం, బీఆర్ఎస్ కౌన్సిలర్ల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.

కౌన్సిలర్ కిశోర్ పార్టీలకతీతంగా అభివృద్ధి చేద్దామంటూనే తమ వార్డుకు తక్కువ నిధులు కేటాయించారన్నారు. వందకోట్ల ఫ్లడ్‌డ్యామేజీ నిధులు ఉన్నట్లా ? లేనట్లా అని అడగగా చైర్మన్ అది ప్రాసెస్‌లో ఉందని తెలిపారు. కౌన్సిలర్ రాము మాట్లాడుతూ వేపూరిగేరికి వెళ్లే రహదారుల వద్ద వీధివ్యాపారులు రోడ్డుకు అడ్డంగా బండ్లు పెట్టడం వల్ల కాలనీకి వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు మాట్లాడుతూ ప్రస్తుత కౌన్సిల్ సమావేశంలో నిధుల కేటాయింపు బాగుందని, కాంట్రాక్టర్లకు భరోసా ఇచ్చి పనులు వేగవంతంగా చేయించాలని కోరారు. కౌన్సిలర్ స్వప్న మాట్లాడుతూ తన వార్డులో కల్వర్టులు, సీసీరోడ్ల నిర్మాణాల పనులు వేగంగా చేయించాలని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ షబ్బీర్‌అలీ పాల్గొన్నారు.

కుక్కలబెడదపై సభ్యుల ఆందోళన

కౌన్సిల్‌లో ఏ సభ్యుడు మాట్లాడినా కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటికి పరిష్కారం చూపాలని కోరారు. ఫ్యామిలీప్లానింగ్ చేసి మళ్లీ కాలనీలలో వదలడం వల్ల ఎ లాంటి ఉపయోగం లేదని, శాశ్వత పరిష్కారం చూపాలని కోరా రు. దాదాపు 10 మందికి పైగా సభ్యులు కుక్కల బెడదనే ప్రధాన సమస్యగా మాట్లాడారు. చివరకు చైర్మన్ ఆనంద్‌గౌడ్ స్పందిస్తూ కు క్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అందరి అభిప్రా యాలు తీసుకుని ముందుకెళదామని చెప్పారు. తనకు ఎంతో మంది మహిళల నుంచి కుక్కల గురించి ఫోన్‌లు వస్తున్నాయని, నిజంగానే ఇది చాలా సీరియస్‌గా పరిగణించాల్సిన విషయమని చెప్పారు. ఏదైనా చేద్దామంటే జంతు ప్రేమికుల నుంచి అధికారులకు ఇబ్బందులు వస్తాయని, ఎలా ముందుకు వెళ్లాలో అర్థం కావడం లేదన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి : చైర్మన్

పార్టీలకతీతంగా మునిసిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇదివరకు చాలా వార్డులలో నిధుల కేటాయింపు విషయంలో పక్షపాతధోరణి అవలంబించారని, ఇకపై అలాకాకుండా అత్యవసరం ఉన్న చోట కాస్త నిధులు ఎక్కువగా కేటాయించి మిగతా అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయింపు చేసుకుందామన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యమంత్రితో మాట్లాడి మునిసిపాలిటీకి పెద్దఎత్తున నిధులు తీసుకువచ్చే పనిలో ఉన్నారని, మనం పూర్తి సహకారం అందించి ఈ పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రజలకు తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులు అందించేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలి

- మాదకద్రవ్యాల రహిత జిల్లాగా రూపొందించాలి
- వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన కలెక్టర్ విజయేందిర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూన్ 29 : జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శనివారం కలెక్టర్ తన చాంబర్‌లో ఎస్పీ డి. జానకి, ఎక్సైజ్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులతో జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్షిస్తూ తగు సూచనలు చేశారు. మాదకద్రవ్యాల నియంత్రణకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా రూపొందించాలని, మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంపై పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలను వినియోగించకుండా కళాశాలలు, విద్యాసంస్థలలో, మెడికల్, ఫార్మసీ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయా కళాశాలలు, పాఠశాలల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై కమిటీలు వేసి అవగాహనకు కార్యాచరణ రూపొందించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖ ద్వారా గట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రద్దీ ఎక్కు వగా ఉండే ప్రాంతాలను హాట్ స్పాట్‌లుగా గుర్తించి పోలీస్ శాఖద్వారా నిఘా ఉంచినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌బీ, డీఎస్పీ జి.వి. రమణారెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ విజయ భాస్కర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా, ఇంటెలిజెన్స్ ఏఎస్పీ అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనిద్దాం

- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి డి. ఇందిర



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఇందిర

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 29 : దివ్యాంగులకు చేయూతనిస్తే వారు అన్ని రంగాలలో ముందుకు వెళ్తారని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి డి. ఇందిర అన్నారు. శనివారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో బ్రాహ్మమానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల గౌరవాన్ని కాపాడేందుకు ఉన్న చట్టాలు, హక్కుల గురించి తెలిపారు. సమాజంలో దివ్యాంగుల పట్ల చిన్న చూపు వద్దని తెలిపారు. దివ్యాంగుల తల్లిదండ్రులు, టీచర్లు దివ్యాంగులైన పిల్లల పట్ల చాలా శ్రద్ధ వహించాలని, వారు అన్ని రంగాలలో విజయం సాధించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ఇక్కడ విద్యార్థులు ల్యాప్‌టాప్ ద్వారా శిక్షణ పొందుతూ మంచి నైపుణ్యం కనబరుస్తున్నారని అన్నారు. అమ్మాయిలు కుట్లు, అల్లికలు, బ్యాగ్స్, ఇతర స్కిల్ డెవలప్‌మెంట్ ఆక్టివిటీస్‌లో మంచి నైపుణ్యం కలిగి ఉన్నారని అభినందించారు. దివ్యాంగులకు ముఖ్యంగా మానసిక, చెవిటి, మూగ, అంధత్వం ఉన్న వారికి వారి వారి పనులను వారే చేసుకునే విధంగా కృషి చేయాలని అన్నారు. చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ గురించి, చైల్డ్ రైట్స్ గురించి లీగల్ సర్వీసెస్ యాక్ట్ గురించి మాట్లాడారు. ఈ అవగాహన సదస్సులో బ్రహ్మ మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, వ్యవస్థాపకులు జి. చంద్రశేఖర్, పేరెంట్స్ అసోసియేషన్ సెక్రెటరీ అంజనీశ్వరి, ఎఫ్ఆర్‌వో నాగరాజు, పాఠశాల బృందం తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

- ఎంపీ డీకే అరుణ ఇంటిని ముట్టడించిన ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు



ఎంపీ డీకే అరుణ ఇంటి ముట్టడికి యత్నిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 29 : నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఇంటిని ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు ముట్టడించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంపీ అరుణ ఇంటిని ఆయా సంఘాల నాయకులు ముట్టడించి, ఎంపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్లమెంట్‌లో నీట్ పరీక్షపై ఎంపీ డీకే అరుణ మాట్లాడాలని నినదించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాసి ఇబ్బంది పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించడం లేదన్నారు. దేశ వ్యాప్తంగా నీట్‌ను రద్దు చేసి మళ్లీ రీఎగ్జామ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు నీట్ పరీక్ష రద్దు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షుడు నందు, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వెల్లువలా సవరణ దరఖాస్తులు



జడ్చర్ల మునిసిపాలిటీ కార్యాలయంలో సవరణ దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు



భూత్పూర్ : అధికారులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో, ఎంపీపీ

జడ్చర్ల/ భూత్పూర్ జూన్ 29 : ప్రజాపాలన దరఖాస్తుల సవరణకు లబ్ధిదారులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు రూ.500కే గ్యాస్ సిలిండర్ సబ్సిడీ కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు సవరణ కోసం ప్రజలు బారులు తీరారు. జడ్చర్ల మునిసిపాలిటీ కార్యాలయ ఆవరణలో మూడు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, సవరణ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ రాజయ్య తెలిపారు. శనివారం నాటికి 1350 సవరణ దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ నెల 30వ తేదీ చివరితేదీ అని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు.

భూత్పూర్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ప్రజాపాలన దరఖాస్తుల సవరణకు మండల పరిషత్ కార్యాలయానికి క్యూకడుతున్నారు. శనివారం పెద్దసంఖ్యలో ప్రజలు కార్యాలయానికి తరలివచ్చారు. ఎంపీడీవో ప్రభాకర్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి దరఖాస్తుదారులతో మాట్లాడారు. సవరణ కోసం వచ్చే దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగనీయకుండా సరిచేయాలని అధికారులకు ఎంపీపీ సూచించారు.

కెమిస్ట్రీలో స్వాతికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 29 : పాలయూరు జిల్లాకు చెందిన స్వాతి ఉస్మానియా యూనివర్సిటీలో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో డాక్టరేట్ పొందారు. శనివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ శివరాజ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన కూతురు డాక్టరేట్ తీసుకోవడం సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కుటుంబ సభ్యులు స్నేహితులు పాల్గొని అభినందించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 29 : జిల్లాలోని నిరుద్యోగ, యువతీ, యువకులు ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జర్దోషి, కంప్యూటర్, ఏసీ మెకానిక్, మొబైల్ రిపేర్, సీసీ కెమెరా, హౌస్‌వైరింగ్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే 13 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామని పేర్కొన్నారు. 14వ విడత శిక్షణ కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 1లోగా, పాత డీఈవో కార్యాలయంలో గల వృత్తి శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441565895 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్‌హెచ్‌ఎంలో 37 పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూన్ 29 : జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో గల నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో 37 కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రిఫ్రిజిరేటర్ మెకానిక్-1, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ (డీపీవో)-01, స్టాఫ్ నర్సు-03, స్టాఫ్ నర్సు(ఎన్‌సీడీ)-23, స్టాఫ్ నర్సు(యూపీహెచ్‌సీ)-01, ల్యాబ్ టెక్నీషియన్ (ఎన్‌సీడీ క్లీనిక్)-01, డీఈవో కమ్ అకౌంటెంట్-01, ఫార్మసిస్టు (యూపీహెచ్‌సీ)-01, డిస్ట్రిక్ట్ ఫిజీషియన్-01, ఎర్లీ ఇన్‌వెన్షనిస్టు కమ్ సోషల్ ఎడ్యుకేటర్-01, ఫార్మసిస్టు (ఆర్‌బీఎస్‌కే ఎంహెచ్‌టీ)-01, మెడికల్ ఆఫీసర్ (మహిళ) ఆర్‌బీఎస్‌కే ఎంహెచ్‌టీ-01 పోస్టులు ఉన్నాయి. ఇవన్నీ ఒక ఏడాది వరకేనని, ఆసక్తి గల అభ్యర్థులు జూలై 1 నుంచి 4వ తేదీలోగా కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసి రెగ్యులర్ స్టాఫ్ నర్సుల నియామకాల వలన తొలగించిన స్టాఫ్ నర్సులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

అతిథి అధ్యాపకులకు 4న మౌఖిక పరీక్ష

జడ్చర్ల, జూన్ 29 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏడు అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి జూలై 4న మౌలిక పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్-2, సంస్కృతం-1, ప్రభుత్వ పాలనాశాస్త్రం-1, కంప్యూటర్ సైన్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్-3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 2వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

భూత్పూర్, జూన్ 29 : మొక్కలను నాటుదాం.. పర్యావరణాన్ని రక్షించుకుందాం అంటూ ఓ వ్యక్తి జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టాడు. వివరాల్లోకి వెళ్లితే.. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణానికి చెందిన చీర్ల కృష్ణయ్యసాగర్ తన వంతు కృషిగా గ్రామాల్లో ప్రజలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఈనెల 22వ తేదీన గద్వాల జిల్లాలోని అలంపూర్ నుంచి తనతో పాటు ఇద్దరు యువకులతో కలిసి పాదయాత్రను ప్రారంభించాడు. శనివారం భూత్పూర్ పట్టణానికి చేరుకున్న కృష్ణయ్యసాగర్ చౌరస్తాలో పండ్లు అమ్ముతున్న చిరు వ్యాపారులతో మాట్లాడారు. పూర్వీకులు సీజనల్ పండ్లు తిని ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నారని, ఈ తరం వారు మాత్రం అనారోగ్యం బారీనపడుతున్నారని పేర్కొన్నారు. చెట్ల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కృష్ణయ్యసాగర్ వెంట యువకులు గోపాల్, దేవేందర్ ఉన్నారు.

సాగు చేసే రైతులకే రైతుభరోసా ఇవ్వాలి



నవాబ్‌పేటలో మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు

జడ్చర్ల/ మిడ్జిల్/ నవాబ్‌పేట/ గండీడ్, జూన్ 29 : వ్యవసాయం చేసే రైతులకే రైతుభరోసా అమలు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరారు. జడ్చర్ల, మిడ్జిల్, నవాబ్‌పేట, గండీడ్ మండలాల్లో రైతు భరోసాపై అధికారులు సమావేశాలు నిర్వహించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. బాదేపల్లి పీఏసీఎస్‌లో శనివారం చైర్మన్ సుదర్శన్‌గౌడ్ అధ్యక్షతన, డీసీవో పద్మ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్‌ల సమక్షంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్‌లు హతీరాం, మంగమ్మ, ఏఈఓ గోపీనాథ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

● మిడ్జిల్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కూచూరు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రైతు భరోసా అమలుపై పలువురు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి పద్మ, మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయులు ఉన్నారు.

● నవాబ్‌పేటలోని యన్మనగండ్ల వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ మాడెమోని నర్సింహులు పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయశాఖ జేడీ వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు రైతులు హాజరయ్యారు. రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో గ్రామాల రైతులు, అధికారులు పాల్గొన్నారు.

● గండీడ్‌లోని రైతు వేదికలో రైతు అభిప్రాయ సేకరణను పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీటీసీ బాలయ్య, డీఏఓ వెంకటేష్, ఏఓ పనీషా, సహకార సంఘం మార్కెటింగ్ అధికారి నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.